కొత్త సంవత్సర సంబురం



కల్వకుర్తిలో



అచ్చంపేటలో బేకరీ వద్ద కేకులు కొనుగోలు చేస్తున్న యువకులు

అచ్చంపేట రూరల్: కొత్త సంవత్సరానికి మండల ప్రజలు ఆదివారం అర్ధరాత్రి ఆహ్వానం పలికారు. యువకులు కేక్‌లు కట్ చేస్తూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిత్రులకు, బంధువులకు ఫోన్ల ద్వారా మెస్సెజ్‌లు పంపుతూ బిజీబిజీగా గడిపారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెప్తూ సందడి చేశారు. అంతకుముందు సాయంత్రం బేకరీల వద్ద కేక్ కొనుగోళ్ల కోసం పోటీపడ్డారు. మహిళలు రంగులు కొనుగోలు చేశారు. పలు పార్టీల ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రధాన రహదారిపై, చౌరస్తాలలో తనిఖీలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

కల్వకుర్తి టౌన్: కొత్త సంవత్సరం పురస్కరించుకొని పట్టణంలోని పలు దుకాణాలు, ప్రధాన కూడళ్లలో జనం రద్దీతో కనిపించాయి. కేకల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. వ్యాపారులు ఇదే అదునుగా భావించి బేకరీల నిర్వాహకులు అధిక ధరలతో కేక్‌లు విక్రయించారు.

పెంట్లవెల్లి: మండల ప్రజలు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. న్యూ ఇయర్ పురస్కరించుకొని మహిళలు రంగులు కొనుగోలు చేశారు. యువకులు రోడ్లపై కేరింతలు వేస్తూ నృత్యాలు చేశారు.

దోమలపెంట: నూతన సంవత్సరం సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు భక్తుల వాహనాల రద్దీ కనిపించింది. స్థానిక దుకాణాలలో కేక్ కొనుగోలు చేశారు. అర్ధరాత్రి వేళ కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

అయోధ్య రాముడి అక్షతలకు పూజలు



అచ్చంపేటలో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని పలు ఆలయాలకు అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను అందించారు. ఆదివారం ఊరేగింపుగా ఆలయాలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఇళ్ల ముందు దీపాలు వెలిగించాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. భక్తులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయానికి అయోధ్య రాముడి అక్షతలు ఆదివారం చేరుకున్నాయి. ఈ సందర్భగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అక్షతలకు ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షతలను మండలంలోని ఆయా గ్రామాలకు పంపిణీ చేశారు. జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ సంగిసెట్టి చంద్రశేఖర్, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

కోతుల కట్టడికి ప్రత్యేక చర్యలు

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులను కోతుల బెడద నుంచి కాపాడుతామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, ఎంపీపీ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాల స్థితి గతులు, సమస్యలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రణీత, సంబు శోభ, సుజాత ఎంపీటీసీలు బాలమ్మ, రహీం, శ్రీనివాసులు, నాయకులు హరి నారాయణ, బుచ్చయ్య, వెంకటరమణ, సత్యనారాయణ, రాజారాం, హాతీరాం, హన్మంత్‌రెడ్డి, యశ్వంత్, రేణయ్య, మల్లికార్జున్, అంబనారాయణ, ఇస్మాయిల్, మధు, పాండు పాల్గొన్నారు.

దోమలపెంట: భక్త మార్కండేయ శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ జెడ్పీటీసీ అనురాధతో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించారు. పద్మశాలీ కులస్తులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు.

వైభవంగా గో వృషభరాజాల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న మహిళలు

కందనూలు: మున్సిపల్ పరిధిలోని ఎండబెట్లలో ఆదివారం అనంత గోశాల ట్రస్ట్ భవనంలో చైర్మన్ సౌజన్య జగన్మోహన్ కులకర్ణి దంపతులు గో వృషభరాజాల కల్యాణాన్ని నిర్వహించారు. వేద పండితులు పవన్ కుమార్, కార్తీక్‌ల మంత్రోచ్చరణ మధ్య కల్యాణ తంతు కొనసాగింది. కల్యాణాన్ని తిలకించడానికి పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో పి.వంశీ మోహన్, శ్యాంసుందర్ మధు, కుటుంబ సభ్యులతో పాటు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని బొల్గట్‌పల్లి స్టేజీ సమీపంలోని లెనిటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు

మన్ననూర్: అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ పుట్టిన రోజు వేడుకను ఆదివారం అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. దోమలపెంట, ఈగలపెంట, వటువర్లపల్లి, ఫరహాబాద్, మన్ననూర్ గ్రామాల్లో కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో విద్యార్థినుల మధ్య పుట్టిన రోజు వేడుకల్లో నిర్వహించారు.

దోమలపెంట: స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో జెడ్పీటీసీ అనురాధ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అదేవిధంగా శనివారం అర్ధరాత్రి జెన్‌కో అతిథి గృహంలో వంశీకృష్ణ దంపతులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎంపీటీసీ మల్లికార్జున, అచ్చంపేట, అమ్రాబాద్ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

కందనూలు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు మాట్లాడుతూ శనివారం మాహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు శ్రీజ, సోనీలు 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను డీఈఓ గోవిందరాజులు అభినందించారు.

కల్వకుర్తి: పట్టణంలోని జేపీనగర్ పాఠశాల గ్రౌండ్‌లో జూనియర్ బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 24 మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. వచ్చే నెల జనవరి 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌లో నిర్వహించనున్న 49వ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ, పీఈటీ యాదయ్య తెలిపారు.

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన నందకిషోర్, ప్రవీణ్, సుదీప్ రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న కల్వకుర్తి జేపీ నగర్ గురుకుల కళాశాల ఆవరణలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-20 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మంత్రిని కలిసిన నాయకులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: పట్టణంలో ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావును పలు ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం కలిశారు. పట్టణానికి చెందిన న్యాయవాదులు, ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్ తోపాటు సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, బోయలపల్లి గ్రామస్తులు, పీఆర్‌టీయూ సంఘం నాయకులు మంత్రిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఏజీ బీఎస్సీలో రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు సాధించిన విద్యార్థి సుష్మను అభినందించారు. ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం



తెలకపల్లి: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే కేశవులుగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆలేరులో సీపీఐ 99వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. విప్లవస్ఫూర్తితో పేదల కోసం అంకిత భావంతో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రమదోపిడీ ఉన్నంత వరకు ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూర్యశంకర్‌గౌడ్, మండల కార్యదర్శి వేణెపల్లి రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు, మండల సహాయ కార్యదర్శి బిచ్చయ్య, సీనియర్ నాయకులు అవుట ఆంజనేయులు, కృష్ణయ్య, రాములు, లింగస్వామి, రామకృష్ణ, ఉస్సేన్, చంది రాములు పాల్గొన్నారు.

రమేశ్‌బాబుకు సన్మానం

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేష్‌బాబును ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శాలువాతో సత్కరించారు. అమరవాది లక్ష్మీనారాయణ, వెంకటేష్, కల్మిచర్ల రమేష్, జగదీశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకు వినతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని కొత్తయాపట్లకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివారం సర్పంచ్ దేవేందర్, ఉపసర్పంచ్ మల్లయ్య, వెంకటస్వామిలు డీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. డీఎం సానుకూలంగా స్పందించారు.

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ఊర్కొండ: మండల కేంద్రంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.



క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు గ్రామానికి చెందిన కడ్తాల సాయిలు బైకు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో రాముడు, మధు, శివగౌడ్, వెంకటస్వామి, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలి

తాడూరు: విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలని ఆ సంఘం మండల నాయకులు బ్రహ్మాచారి, కృష్ణమాచారి, భాస్కరాచారిలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చేతివృత్తులను నమ్ముకుని జీవించే తమకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. నాయకులు రామాచారి, తిరుపతాచారి, మల్లాచారి, భాస్కర్, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

అచ్చంపేట రూరల్: పట్టణంలో గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నో డ్రగ్స్, నో డ్రింక్, నో స్పీడ్ డ్రైవింగ్ సంబంధించిన కరపత్రాలను ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలోని యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు బాబాఅత్తారి, సర్వర్‌అత్తారి, మక్బూల్‌అత్తారి, హబీబ్ అత్తారి, సయీద్‌అత్తారి పాల్గొన్నారు.

కోదండరాంకు మంత్రి పదవి ఇవ్వాలి

కల్వకుర్తిరూరల్: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర నాయకుడు సదానందం గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

ముమ్మరంగా ఆలయ నిర్మాణం పనులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో శ్రీకృష్ణ దేవాలయం నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి సహకారంతో స్లాబ్ పనులు పూర్తి చేశారు. సర్పంచ్ సుశీలా ఈశ్వర్, స్థల దాత జైపాల్‌రెడ్డి, మణెమ్మ, వెంకట్రామిరెడ్డి, లింగం, తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు 2023 సంవత్సరం చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గద్వాల, వనపర్తి, పెబ్బేరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎంపికపై హర్షం

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ సంఘం డైరెక్టర్‌గా మన్ననూర్ గ్రామానికి చెందిన పిట్టల నరేష్‌ను ఎంపిక చేయడంపై ముదిరాజ్ సంఘం గ్రామ నాయకులు సురేష్, వీరయ్య, సతీష్, శేఖర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

స్థానికులకే ఎంపీ టికెట్‌ను ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్/కొల్లాపూర్: ఎంపీ టికెట్ స్థానికులకే కేటాయించాలని డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు డాక్టర్ చెన్నయ్య ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. వచ్చే ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు పలువురు జూపల్లిని కలిసిన వారిలో ఉన్నారు.

అసంపూర్తిగా బీటీ రోడ్డు నిర్మాణం



వెల్దండ: మండలంలోని చెర్కూర్-భర్కత్‌పల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులు అసంపూర్తిగానే వదిలేశారు. భర్కత్‌పల్లి సమీపంలో ఫారెస్టు భూమి ఉండడంతో అధికారులు పనులను నిలిపివేశారు. దీంతో బీటీరోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కంకర తేలినరోడ్డులో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.